# మృత్యుదేవత మరో రూపం



*హలాగ్రేణ హతామాతా*
*విషాన్నేన హతస్సుతః*
*మాతాపుత్ర విరోధాయ*
*హిరణ్యాయ నమోనమః*

*భావం:* నాగలిమొన వల్ల తల్లి చనిపోయింది. విషాన్నం వల్ల కొడుకు మరణించాడు. మాతాపుత్రుల విరోధానికి కారణమైన బంగారానికి నమస్కారం.

డబ్బు పాపిష్టిది అని అందరూ అంటూనే ఉంటారు. అందరూ ఒప్పుకుంటూనే ఉంటారు. అయినా మనకున్న డబ్బుమీద మమకారం పోదు, మనది కాని డబ్బుమీద ఆశపోదు. రోడ్డుమీద నడుస్తూ పోతున్నప్పుడు వందరూపాయల నోటు కనబడితే మనది కాదులే అని వంగి తీసుకోని వారెందరు? సులభ సాధ్యం కాకపోయినా ప్రయత్నిస్తూనే ఉంటాం. ధనవ్యామోహం లేకపోతే నాగరికత ఇంతగా అభివృద్ధి చెందేది కాదంటారు. అభివృద్ధికి పోటీయే మూలాధారమట.

యాహూని కొనడానికై ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్, టెలివిజన్ రారాజురూపర్ట్ మర్డోక్ పోటీపడ్డారు. పోటీలూ, శత్రుత్వాలూ, వంచనలూ, ధనిక వర్గానికే పరిమితమని సినిమా రంగం నిపుణులూ, వివిధ వాదాల రచయితలూ వల్లిస్తూ ఉంటారు. కానీ ముష్టిచిప్పకోసం కూడా దెబ్బలాడుకోవడం జరుగుతూనే ఉంటుంది. ఈ పరిస్థితి నుంచే యాచకః యాచకోశత్రుః అన్న నానుడి పుట్టింది.

అయితే ఈ పోటీలు ఏ సంబంధం లేని వారి మధ్యనే ఉంటాయా? అన్నతమ్ములు ఆస్తి తగాదాలతో కోర్టుకెక్కడం, అక్కచెల్లెళ్లు తల్లి నగలకై పోట్లాడు కోవడం చూస్తే ప్రేమని ధనం జయిస్తుందనే అన్పిస్తుంది. తల్లిని మించిన దైవం లేదనీ, పిల్లలకై తల్లి సర్వస్వం త్యాగం చేస్తుందనీ మన సమాజంలో ఉన్న గాఢ నమ్మకం నిజమా?

ఒక గ్రామంలో ఒక కుటుంబముంది. ఆ కుటుంబానికి ఉన్న భూమిని ఇంటి పెద్ద కొడుకు సాగుచేస్తూ ఉండేవాడు. అతనితో అతని తల్లి నివసించేది. పొలం మీద పంట రాగానే ఆమె చాలా భాగం కూతుళ్ళకి చేరవేసేది. తను కష్టపడి సాగుచేసిన పంట ఇంటికి రాగానే ధాన్యం అమ్మేసి డబ్బు కూతుళ్లకి పెట్టడం అతనికి ఇష్టముండేది కాదు.

పొలమంతా పిత్రార్జితం. దాని మీద కొడుక్కి ఎంత హక్కుందో తనకీ, కూతుళ్లకీ కూడా అంతే హక్కుందని తల్లి నమ్మకం. స్త్రీలకి ఆస్తిహక్కు

ఆ రోజుల్లో లేదు. అయినంత మాత్రాన ఫలసాయంమీద హక్కు లేదంటే ఎలా? తల్లీ కొడుకులకి డబ్బు విషయంలో  ఎప్పుడూ యుద్ధం జరిగేది. కొడుకు కొన్నాళ్ళకి ఇంక లాభం లేదనుకున్నాడు. తల్లి ఇలాగే ఉంటే తను బికారి అవడం ఖాయమనుకున్నాడు. మధ్యాహ్నం పొలానికి అన్నం తెచ్చిన తల్లిని నాగలిమొనతోకొట్టిచంపి, దగ్గరలో ఉన్న వాగులో పడేశాడు. శవం కొట్టుకుపోయింది. ఇంక హాయిగా బతకచ్చు అనుకుంటూ అన్నానికి కూచున్నాడు. రెండు ముద్దలు తినగానే నేలకి ఒరిగాడు. అతనికొచ్చిన ఊహే అతని తల్లికీ వచ్చింది. కొడుకుని పైకి పంపేస్తే ఆస్తి మొత్తం అనుభవించవచ్చని ఆమె కొడుకు అన్నంలో విషం కలిపి తెచ్చింది.

ఆ విధంగా తల్లీ కొడుకుల విరోధానికి కారణమైన బంగారానికి (ఆరోజుల్లో బంగారు నాణేలు ఉండేవి) కవి నమస్కరించాడు. నిజానికి డబ్బు పాపిష్టిది కాదు. ధనం మీద వాంఛ పాపిష్టిది. పడవలో వెళ్ళే వాడు తాగడానికి నీరు పడవలో ఉంచుకోవడం అవసరం. కానీ పడవంతా నీరు నిండితే ప్రమాదం. ధనమైనా అంతే. జీవనోపాధికీ, సత్కార్యాలకి వినియోగించడానికీ ధనం కావాలి. దురాశ మాత్రం నాశనానికి దారితీస్తుంది. కలహ కారణమౌతుంది.

******